ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు!

- ఒట్టి పోయిన హంద్రీనది
- నదీతీర గ్రామాల్లోనూ నీటి ఎద్దడి
- కోడుమూరులో నాలుగురోజులకోసారి తాగునీటి సరఫరా
- పట్టించుకోని అధికారులు


వానల్లేక ఒట్టిపోయిన హంద్రీనది


కోటవీధి ట్యాంక్ వద్ద నీరు పట్టుకునేందుకు బారులు తీరిన ప్రజలు

కోడుమూరు రూరల్ : వర్షాకాలం అయినా నీటి సమస్య తప్పడం లేదు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభవ్వగా మొదటి వారంలో వర్షాలు కురిశాయి. సరిగ్గా నెలకు మరోమారు వరుణుడు కరుణించాడు. అయినా హంద్రీకి నీరు రాలేదు. నీళ్లు లేక ఒట్టిపోయింది హంద్రీనది. దీంతో వర్షాధార పంటల సాగుకే కాదు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యేకించి మండల కేంద్రం కోడుమూరు మంచినీటి సమస్య ముప్పు ముంచుకొస్తుంది. నదీతీర గ్రామాల్లోనూ నీటి సమస్య మొదలైంది. పట్టణ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. 40వేలకుపైగా జనాభా ఉన్న కోడుమూరు పట్టణ ప్రజలకు మంచినీటిని గ్రామ పంచాయతీ అధికారులు హంద్రీనది నుంచి సరఫరా చేస్తున్నారు. ఎనిమిది బోర్లను వేసి వాటి ద్వారా నీటి ట్యాంకులు నింపుతున్నారు. అనంతరం కాలనీల కుళాయిలకు నీటి సరఫరా చేస్తున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో ప్రస్తుతం ఎనిమిది బోర్లలో కేవలం ఐదుబోర్లలో మాత్రమే నీటి లభ్యం అవుతుంది. ఐదు బోర్లు కూడా యథావిధిగా పనిచేయని పరిస్థితి. కొన్ని గంటలు విరామం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని బోర్లు రోజుమార్చిరోజు పనిచేస్తున్నాయి. దీంతో నీటి సమస్య నెలకొంది.

నాలుగురోజులకోసారి నీటి సరఫరా

పట్టణంలో నీటి సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతుంది. పదిరోజుల కిందట రెండురోజులకోసారి నీటి సరఫరా చేశారు. వారం కిందట మూడురోజులకోసారి నీళ్లు ఇచ్చారు. ప్రస్తుతం నాలుగు రోజులకఓసారి నీరు సరఫరా చేయిస్తున్నారు అధికారులు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి కొండపేట, వెంకటేశ్వరనగర్, లక్ష్మీనగర్, వెంకటగిరి రోడ్డు, మోబీన్‌వీధి, మెయిన్‌బజార్, కుర్నీ నగర్‌లకు 4నుంచి నుంచి 5రోజులకోసారి కొళాయిలకు నీటిని వదులుతుండడంతో ప్రజలు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పట్టణంలో నీటి సమస్య మరింత జఠిలంగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి గాని, ఎల్‌ఎల్‌సీ నీటిని గాని హంద్రీనదికి విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గతేడాది గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి హంద్రీకి నీరు విడుదల

గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ హంద్రీనది ఒట్టిపోయింది. అయితే ప్రజాప్రతినిధులు అప్రమత్తమయ్యారు. నీటి సమస్య తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి హంద్రీకి నీరు విడుదల చేయించారు. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పాయి. గతేడాది గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేయించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్న ప్రజలు ప్రస్తుతం ఎల్ఎల్‌సీలో నీరు పుష్కలంగా పారుతున్నా ఎందుకు స్పందించడం లేదంటూ నిట్టూర్చుతున్నారు.

స్పందించని ఇరిగేషన్ అధికారులు

హంద్రీనది ఎండిపోవడంతో నదీతీర గ్రామాలైన వర్కూరు, కోడుమూరు, ముడుమలగుర్తి, గోరంట్లతో పాటు, వెంకటగిరిలో మంచినీటి సమస్య తలెత్తుతోందని ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈనెల 27న జరిగిన కోడుమూరు మండల మీట్‌లో ప్రజాప్రతినిధులు నీటి సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఎల్ఎల్‌సీ నీటిని హంద్రీకి, కొత్తూరు కుంటకు విడుదల చేయాలని విన్నవించారు. జిల్లా అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన ఇరిగేషన్ అధికారులు నేటికీ స్పందించ లేదు. వారం రోజులు గడిచినా ఇంతవరకు హంద్రీకి నీటిని విడుదల చేయలేదంటూ ప్రజాప్రతినిధులు సైతం అధికారుల తీరును తప్పుపడుతున్నారు.

ఐదు రోజులకోసారి నీటి సరఫరా



నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. కుళాయిలకు ఐదు రోజులకోసారి నీరు వదులుతున్నారు. వదిలిన నీరు కూడా అందుతుందన్న నమ్మకం లేదు. ప్రతి రోజు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చుట్టు పక్కల బోర్లలో కూడా మంచినీళ్లు లేవు. రూ.20 చొప్పున క్యాన్ మంచినీళ్లు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి. – శ్రీనివాసులు, కోడుమూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

వానల్లేక హంద్రీనది ఒట్టిపోయింది. నదిలో నీళ్లు లేక మంచినీటి పథకాలు సరిగా పనిచేయడం లేదు. హంద్రీనదికి ఎల్ఎల్‌సీ నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. నీటి అవసరాలపై ఇరిగేషన్ అధికారులతో కూడా మాట్లాడా. నీటి విడుదల కోసం వేచిచూస్తున్నాం.
– ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కోడుమూరు

క్లుప్తంగా

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ సమీపాన కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామివారి మూల విగ్రహాలను అభిషేకాల నిర్వహించి ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వీబీఎస్ మండల కార్యదర్శిగా గోవర్ధన్

సి.బెళగల్: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం సి.బెళగల్ మండల కార్యదర్శిగా బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ గోవర్ధన్ ఎంపికయ్యారు. ఏపీ వీబీఎస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు బోయ గోవర్ధన్‌కు సంఘం సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. వాల్మీకి,బోయల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని గోవర్ధన్ తెలిపారు.

ముర్రుపాలతో పసిబిడ్డలకు ఆరోగ్యం


మాట్లాడుతున్న ఏసీడీపీఓ పద్మావతమ్మ

పాణ్యం: ముర్రుపాలు పసిబిడ్డలకు ఎంతో ఆరోగ్యమని ఏసీడీసీఓ పద్మావతమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఏసీడీపీఓ మాట్లాడుతూ ముర్రుపాలు పసిపిల్లలకు అన్నివిధాలుగా ఆరోగ్యకరమన్నారు. పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కళాక్షేత్రం అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: కళాకారులకు అండగా ఉండి, స్థానిక కళాక్షేత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ రాజ్య సభ సభ్యులు, టీజీవీ కళాక్షేత్రం గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో టీజీవీ కళాక్షేత్రం శాశ్వత సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. కళాక్షేత్రం గౌరవ చైర్మన్‌గా టీజీ వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కరోనా తరువాత కళాక్షేత్రం మొదటి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అంతకు ముందు టీజీవీ కళాక్షేత్రం సావనీర్‌ను ఆవిష్కరించారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై ఆకస్మిక తనిఖీలు

కర్నూలు (టౌన్): నగరంలో నిషేధిత ప్లాస్టిక్‌పై శనివారం నగర పాలక ఆరోగ్యశాఖ అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగరంలోని అన్ని వాణిజ్య ప్రాంతాల్లో ఒకేసారి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయాల కార్యదర్శులు తనిఖీలు చేపట్టారు. 16 డివిజన్లలో మొత్తం 618 షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి 215 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. విక్రయదారులకు రూ.50,250 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా నగరంలో ప్లాస్టిక్‌పై దాడులు కొనసాగిస్తున్నామన్నారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బేసిక్ మెడికల్ ఎడ్యుకేషన్ అవసరం

కర్నూలు(హాస్పిటల్): వైద్యవిద్యలో బోధకులుగా ఉన్న వారందరికీ బేసిక్ మెడికల్ ఎడ్యుకేషన్ కోర్సు అవసరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఎంఈయూ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ కె. చిట్టినరసమ్మ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని, ముఖ్యంగా మెడికల్ టీచర్లకు ఇలాంటి శిక్షణలు తప్పనిసరి అని చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ అబ్జర్వర్ డాక్టర్ కవిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, ఎంఈయు సభ్యులు డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ విశాల, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అరుణ, డాక్టర్ కుముద, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రైతు సుంకన్న

కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నను నిత్యం కష్టాలే వెంటాడుతున్నాయి. కష్టించి పంటలు సాగు చేస్తే సకాలంలో వానలు కురవడం లేదు. పంటలు పండించినా దిగుబడులకు ధరలు లేక తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరకు అప్పులు తీర్చే మార్గంలేక..ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ కోవలోనే కోడుమూరు మండలం అనుగొండకు చెందిన సుంకన్న (46) అనే రైతు తనకున్న రెండెకరాల పొలముతో పాటు, మరో నాలుగెకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. గత రెండేళ్లుగా వ్యవసాయం కలిసిరాక పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కక అప్పుల్లో కూరుకుపోయాడు. మరోవైపు కుమార్తె వివాహం, పొలంలో బోర్లు వేసేందుకు చేసిన అప్పుల పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సుమారు రూ.9లక్షల వరకు అప్పులు పెరిగాయి. చివరకు అప్పులు తీర్చే మార్గం లేక రైతు సుంకన్న శనివారం తెలవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు ఆరాతీయడంతో పాటు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసుకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సుంకన్నకు భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుటుంబ పెద్ద దిక్కు మృతితో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.


భూసేకరణ వివరాలు తెలుసుకుంటున్న జేసీ విష్ణుచరణ్


సోలార్ నమూనాను పరిశీలిస్తున్న జేసీ

సోలార్ పరిశ్రమను పరిశీలించిన జేసీ

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురంలోని సోలార్ పరిశ్రమను శనివారం నంద్యాల జిల్లా జేసీ విష్ణు చరణ్ పరిశీలించారు. పిన్నాపురం సమీపంలో చేపడుతున్న హైడల్ విద్యుత్ ఉత్పాదక పరిశ్రమ, వాటి నమూనాను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. సోలార్ పరిశ్రమకు ఎంత భూములిచ్చారు.. పరిశ్రమ పనులు ఎంత పూర్తి చేశారు... రైతులకు ఎంత వరకు పరిమారం ఇచ్చారు తదితర విషయాలపై జేసీ ఆరా తీశారు. పరిశ్రమకు సంబంధించి ఫీల్డ్ నమునా వివరాలను సర్వేర్లను అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, డీటీ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పంట నమోదు చేయించుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ– పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సుధాకర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని హుసేనాపురం, ఉప్పలపాడు గ్రామాలలో సాగైన పంట పొలాలను శనివారం ఏఓ పరిశీలించారు. రైతులతో సాగుపై చర్చించారు. ఈ – పంట నమోదు ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, వీఏఏలు, రైతులు తిరుపాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గొల్లలదొడ్డి గ్రామంలో సాగైన పంటలను శనివారం ఏఓ మల్లేష్‌కుమార్ పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది చేపట్టిన పంట నమోదును పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. ఈ క్రాప్ నమోదు ప్రయోజనాలను రైతులకు ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్ధు, ఎంపీఈఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులపై దృష్టి పెట్టండి

కర్నూలు(సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జరుగుతున్న మనబడి – మన భవిష్యత్తు కార్యక్రమ పనులను తక్కువ డబ్బుతో పూర్తి చేయగలవాటిపై దృష్టి పెట్టాలని డీఈఓ శామ్యూల్ ఎంఈఓలకు సూచించారు. శనివారం జిల్లా విద్యా శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై డీఈఓ మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే వారం నుంచి విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లాల్లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై వ్యతిరేక ప్రకటనలు మీడియాలో ప్రచురితమైతే వెంటనే ఆయా ప్రాంతాలకు చెందిన అధికారులు ఖండనలు ఇవ్వాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా పాఠ్య ప్రణాళికలు తయారు చేసుకోవాలని, దానిపై హెచ్ఎం సంతకం ఉండాలన్నారు. వచ్చే వారం నుంచి పని సర్దుబాటు ప్రక్రియ మొదలుపెడతారన్నారు. వివిధ కేటగిరీల్లో ఉపాధ్యాయులకు ఇచ్చే అవార్డులకు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని సీబీఎస్ఈ స్కూళ్లలో ఈనెల 10వ తేదీ నుంచి ఎఫ్ఏ–1 ఫార్మటివ్ అసెస్‌మెంట్ టెస్టు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో డీఈఓ ఆఫీస్ ఏడీఈ శామ్యూల్‌పాల్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

తీజ్ పండుగను ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు (అర్బన్): బంజారాల అతి ముఖ్యమైన తీజ్ పండుగను ఘనంగా నిర్వహిద్దామని గోర్ బంజారా నాయకులు ఎస్.నాగరాజు నాయక్ అన్నారు. శనివారం సత్యనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో తీజ్ ఉత్సవ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగను ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు 9 రోజుల పాటు జరపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గోర్ బంజారా నాయకులు రంగస్వామి నాయక్, సీమ కృష్ణ రాథోడ్ రామాంజి నాయక్, గణేష్ నాయక్, శంకర్ నాయక్, సేవ్య నాయక్, గోరియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై అభిప్రాయ సేకరణ

కర్నూలు(సెంట్రల్): రేషన్ కార్డుదారులకు ఇంకా ఎలాంటి నిత్యావసరాలు అందజేస్తే బాగుంటుందో తెలియజేయాలని డీఆర్వో/ఇన్‌చార్జి జేసీ కె.మధుసూదన్‌రావు అధికారులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ కార్డులకు అందజేయాల్సిన నిత్యావసరాలపై డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, గ్యాస్ డిస్ట్రిబూషన్ ఏజెన్సీలు, రైస్‌మిల్లర్లతో ఆయన సమావేశమై అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పౌరసరఫరాల ద్వారా బియ్యం, బ్యాళ్లు, చెక్కర ఇస్తున్నామని, ఇంకా ఏమైనా ఇస్తే బాగుంటుందో ప్రజలతో అభిప్రాయ సేకరణ చేసి నివేదించాలని ఆదేశించారు.అంతేకాక పౌరసరఫరాల శాఖ బలోపేతానికి కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పి.నరసింహయ్య (42) కర్నూలులో అదృశ్యమయ్యాడు. ఈయనకు మద్యం తాగే అలవాటు ఉండి అనారోగ్యంతో గత నెల 27వ తేదీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం భార్య సువర్ణ కర్నూలు అంతా గాలించినా కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 5.6 అడుగుల ఎత్తు ఉండి, చామన ఛాయ రంగు ఉంటాడు. అతను పారిపోయేటప్పుడు పసుపు, నీలం, ఎరుపు రంగు గల గీతల టీషర్టు, నల్లటి లుంగీ ధరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. చేతికి సాయిబాబా వెండి ఉంగరం, సింధూరం రంగు కాశీ తాడు చేతికి ధరించాడు. భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

30 ఏళ్ల పోరాటం ఫలించింది

కర్నూలు (సిటీ): 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పేరపోగు లక్ష్మన్న అన్నారు. శనివారం బి.తాండ్రపాడు గ్రామంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి టీజీ భరత్ చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం మాదిగలు ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం చేయాలన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కర్నూలు కల్చరల్: కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని టంగుటూరు ప్రకాషం పంతులు పురపాలక పాఠశాలలో పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లను అందజేశారు. సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, విశ్రాంత తహసీల్దార్లు రోషన్ అలీ, అజయ్‌కుమార్, మహిళా సంఘం నాయకులు సుమలత తదితరులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి విజయ్‌కుమార్‌కు అందజేశారు.


కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటిన దృశ్యం

మట్టి తోలించి..మొక్కలు నాటించి

- నిరుపయోగమైన స్థలాన్ని ఉపయోగంలోకి తెచ్చిన ఎంపీడీఓ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఓర్వకల్లు: దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వినియోగంలోకి తెచ్చారు ఎంపీడీఓ మల్లీశ్వరి. స్థానిక పోలీసు స్టేషన్ పక్కన సర్వే నంబర్ 471/సీలో గతంలో మండల వ్యవస్థ సమయంలో 1.65 ఎకరాలను ప్రభుత్వ కార్యాలయాల నిమిత్తం కేటాయించారు ఉన్నతాధికారులు. పెద్దపెద్ద బండరాళ్లతో కూడిన ఆ స్థలంలో కొంత భాగంలో మండల పరిషత్, హౌసింగ్, జాతీయ ఉపాధి హామీ కార్యాలయాలను నిర్మించారు. మిగతా స్థలాన్ని నిరుపయోగంగా అలా వదిలేశారు. ప్రభుత్వ కార్యాలయాల పక్కనే అపరిశుభ్రతకు నిలయంగా ఉండేది ఆ స్థలం. బండరాళ్లతో నిరుపయోగమైన సుమారు 50 సెంట్ల ప్రభుత్వ స్థలం కార్యాలయాల ఎదుట అందహీనంగా, ఇబ్బందికరంగా మారింది. ఏళ్ల తరబడి కనీసం ఆ స్థలం గురించి కనీసం ఆలోచించిన అధికారే లేరని చెప్పకతప్పదు. అయితే గత సార్వత్రిక ఎన్నికల ముందు బదిలీపై ఓర్వకల్లు ఎంపీడీఓగా వచ్చిన మల్లీశ్వరి మాత్రం సానుకూలంగా స్పందించారు. ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రూ.2.50 లక్షల ఉపాధి నిధులతో ఎర్రమట్టి తోలించి, మొక్కలు నాటించారు. దీంతో ఆ ప్రాంగణం పచ్చని మొక్కలతో పార్కును తలపిస్తుంది. ఎంపీడీఓ చొరవను ప్రజలు హర్షిస్తున్నారు.


ఓర్వకల్లు ఎంపీడీఓ కార్యాలయం





ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం పాఠశాలలో హెచ్ఎం నిర్మలవసంత కుమారి ఆధ్వర్యంలో పీఈటీ సత్యకుమార్ విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. 7, 8, 9 తరగతుల విద్యార్థుల వివిధ పిరమిడ్ ప్రదర్శనలు చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు అభినందించారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

ఓర్వకల్లు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలు, 3 మజారా గ్రామాలలో అన్ని రకాల కేటగిరీలలో కలిపి మొత్తం 7,707 మంది పింఛన్ దారులు ఉన్నారని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు 7,663 మందికి పింఛన్ సొమ్ము అందజేశామని చెప్పారు. మిగతా 44 పింఛన్‌దారులలో 28 మరణించారని, 16 మంది తాత్కాలిక వలస వెళ్లారని చెప్పారు.